# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **చిత్తూరుజిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పంలో 'జన నాయకుడు' కేంద్రాన్ని ఈరోజు ప్రారంభించారు.**
2. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రులు తెలిపారు.**
3. **రాష్ట్రంలో రహదారి మరమ్మత్తు పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.**
5. **రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది.**

==========================

చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండవరోజు పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఈ ఉదయం కుప్పంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో 'జన నాయకుడు' కేంద్రాన్ని ప్రారంభించి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వినతులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే సభ నిర్వహణ ఏర్పాట్లను మంత్రులు ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 90 వేల కోట్ల రూపాయలతో హరిత శక్తి, భారీ ఔషద పరిశ్రమలకు ప్రధానమంత్రి శంఖుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రులు పేరొన్నారు.

---------------------------

రాష్ట్రంలో రహదారి మరమ్మత్తు పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా, బనగానపల్లెలో రింగ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గుంతల రహిత రహదారులను నిర్మించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 861 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు.

వాయిస్ ( 20 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒక అమృత్ సరోవరం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ అన్నారు. ప్రకాశం జిల్లాలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు ఒంగోలులో ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకులకు ఉపాధి హామీ పథకం అమలులో పాటించాల్సిన పద్దతుల గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా పంచాయితీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్ .. 34 సెకన్లు

---------------------------

సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఇందులో భాగంగా కాచిగూడ, చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్ మధ్య ఆరు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపింది. ఈ రైళ్లు ఈ నెల 11, 12, 15, 16 తేదీల్లో కాచిగూడ - శ్రీకాకుళం రోడ్ మధ్య రాకపోకలు సాగించనున్నట్లు పేర్కొంది. అలాగే, చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డుకు 8, 9 తేదీల్లో రెండు రైళ్లు నడపనున్నామని తెలిపింది.

---------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విస్తరిస్తున్నట్లు విమానాశ్రయం డైరెక్టర్ యం. లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. గన్నవరంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ఢిల్లీ, ముంబై, చెన్నై, విశాఖపట్నం తదితర దేశీయ ప్రాంతాలతో పాటూ అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య రోజుకి 5వేలకు చేరుకుందన్నారు. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు విమానాశ్రయ అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి తగిన సూచనలు అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది అగస్టు నాటికి నూతన టెర్మినల్ భవనాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. 2024-25 విద్యా సంవత్సరంలో ముందుగా ప్రకటించినట్లుగానే ఈ నెల 10వ తేదీ నుంచి సెలవులు ప్రారంభం అవుతాయని ఓ ప్రకటనలో తెలిపింది. సెలవులు 19న ముగియనుండగా, జనవరి 20వ తేదీ నుంచి పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయని పేర్కొంది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనసేవను ఈ ఉదయం నిర్వహించారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సుగంధ పరిమళ ద్రవ్యాలతో ఆలయాన్ని శుద్ధి చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి అధికారులు తెలిపారు. తరువాత సామాన్యభక్తులను దర్శనానికి అనుమతించారు. తిరుమంజనం సందర్భంగా ఈరోజు విఐపీ విరామ దర్శనాలు, పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు మాట్లాడుతూ....

వాయిస్ ( 18 సెకన్లు)

-------------------------

క్షయ వ్యాధిని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డా తెలిపారు. టిబి ముక్త్ భారత్ అభియాన్– 100–రోజుల ప్రచార కార్యక్రమంపై ఆయన ఢిల్లీలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. దేశంలో ఈ వ్యాధి 17.7 శాతం మేర తగ్గిందని ప్రపంచ నిర్మూలన స్థాయిలో దాదాపు రెట్టింపుగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొందని ఆయన వెల్లడించారు. భారత్ లో క్షయ వ్యాధికి చికిత్స గతంలో 53 శాతంగా ఉండగా ,ఇప్పుడు 85 శాతానికి పెరిగిందని ఆయన పేర్కొన్నారు

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం ద్వారా ఆరోగ్య భారత్ ఆవిష్కరణ సాధ్యమవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సి సి అధికారి డాక్టర్ వై. పోలినాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని కళాశాల ఆవరణలో నేషనల్ కాడెట్ కోర్ ఆధ్వర్యంలో "మెగా స్వచ్ఛ భారత్" కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పరిశుభ్ర భారత్ ఆవిష్కరణలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో మహిళలు స్వీయ ఆర్థికాభివృద్ధి సాధించుకోవాలన్నదే, ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాకుళం శాసనసభ్యులు, గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను ఆయన నిన్న ప్రారంభించి స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ, మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు తక్కువ వడ్డీతో రుణాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఆయన తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు రేపు, ఎల్లుండి కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి నేతృత్వంలోని ఈ బృందం కరువు మండలాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయనుంది. గత ఏడాది ఖరీఫ్ పంటకాలంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో అన్నమయ్య, చిత్తూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని 27 మండలాల్లో తీవ్ర కరువు, మరో 27 మండలాల్లో మధ్యస్థ కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని ప్రకటించింది. ఈ మండలాల్లో కేంద్రబృంద సభ్యులు మూడు బృందాలుగా పర్యటించనున్నారు.

=====================